
సాక్షి ప్రకాశం

శనివారం। 23। ఆగస్టు। 2025



మందు..విందు..పొందు

కనిగిరి సమీపంలో ఉన్న పునుగోడు రిజర్వాయర్ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. - 8లో..



భార్యను కడతేర్చిన భర్త

భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను గొంతు కోసి హత్య చేసిన ఘటన బేస్తవారిపేట మండలంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

గాలి కొదిలేసి..
భూములపై కన్నేసి!



కొత్తపట్నం సముద్రతీరం

సొంత భూముల ధరలు పెంచుకోవడానికేనా..

అభివృద్ధి పేరుతో నిరుపేద సామాన్యులకు చెందిన భూములను కాజేయడానికి కూటమి పాలకులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తపట్నం మండలంలోని తమ భూములకు రేటు పెంచుకోవడంతో పాటుగా ఎయిర్ పోర్టు, హార్బర్ల పేరుతో విలువైన భూములను కబ్జా చేసేందుకు కూటమి పాలకులు ప్రయత్నిస్తున్నారని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అల్లూరు, కె.పల్లెపాలెం గ్రామ పరిసరాల్లో వేలాది ఎకరాలు సేకరిస్తున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను వదిలిపెట్టి ప్రైవేటు భూములను సేకరించడం ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు.

ఎయిర్ పోర్టు..ఫిషింగ్ హార్బర్..
రెండు దశాబ్దాలుగా జిల్లా వాసులకు తీరని కోరికగా మిగిలిపోయాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా హడావుడి చేస్తుంటారు. వీటి ముసుగులో భూ దందాకు తెగబడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ అనుకూల మీడియాలో ఇక్కడ అభివృద్ధి జరిగిపోతోందంటూ కథనాలు అచ్చేసి కొత్తపట్నం పరిధిలోని భూమి ధరలు పెంచేసి వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి అభివృద్ధి పేరుతో ప్రైవేటు భూముల సేకరణ షరా మామూలై పోయింది. ఈ సారి కూడా అదేతంతు కొనసాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- హార్బర్, ఎయిర్‌పోర్టుల పేరుతో హంగామా
- జిల్లా కేంద్రానికి సమీపంలో భూ దందాకు రంగం సిద్ధం
- కొత్తపట్నం మండలంలో ప్రభుత్వ భూములు కాదని ప్రైవేటు భూముల సేకరణ
- ఎయిర్ పోర్టు పేరుతో అల్లూరు వద్ద 1088 ఎకరాల భూముల సేకరణకు రంగం సిద్ధం
- 2014–19లో ఇదే తరహాలో హడావుడి చేసి పునాది కూడా వేయని బాబు సర్కార్
- దొనకొండ ఎయిర్ పోర్టును గాలికి వదిలేసినట్లేనా ?
- పాలకుల మాటలపై నమ్మకం లేదంటున్న స్థానికులు
- ప్రభుత్వ భూములను వదిలిపెట్టి ప్రైవేటు భూముల సేకరణపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కరేడు భూముల వ్యవహారంలో ఒకవైపు వివాదం కొనసాగుతున్న తరుణంలోనే మరోవైపు కొత్తపట్నం మండలంలోని భూములపై కన్నేయడంపై ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కొత్తపట్నం మండలంలోని తీరప్రాంతాల భూములపై కన్నేసిన అధికార పార్టీ నాయకులు ఇక్కడి ప్రజలకు ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తామని చందమామ కబుర్లు చెబుతున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014–19లోనూ నాటి చంద్రబాబు ప్రభుత్వం ఇదే తరహాలో హడావుడి చేసింది. ఒక్క పునాదిరాయి కూడా వేయకుండానే గద్దె దిగిపోయింది. తాజాగా ఇప్పుడు కూడా అదే విధంగా మళ్లీ హడావుడి మొదలు పెట్టింది. అయితే ఈసారి తీరప్రాంతంపై కన్నేసి పెద్ద సంఖ్యలో భూముల సేకరణకు రంగం సిద్ధం చేసుకుంటోంది. దీంతో కూటమి ప్రభుత్వ తీరు మీద ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిజంగానే విమానాశ్రయాలు కట్టి ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తారా లేకపోతే ఆ పేరుతో వేల ఎకరాలు అప్పనంగా కాజేస్తారా అని గుసగుసలాడుకుంటున్నారు.

విమానాశ్రయం పేరుతో 1088 ఎకరాల సేకరణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు సమీపంలో ఎయిర్ పోర్టు నిర్మించనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీ నుంచి వచ్చిన బృందం ఇక్కడి భూములను పరిశీలించి వెళ్లింది. కొత్తపట్నం మండలంలోని అల్లూరు వద్ద ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జనవరిలో ఒంగోలుకు వచ్చిన కేంద్ర విమానయాన సంస్థ కమిటీ సభ్యులు అల్లూరు భూములను పరిశీలించి వెళ్లారు. అల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో రెవెన్యూ అధికారులు భూసేకరణకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం మొదటి దశలో 657 ఎకరాల భూమిని సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఈ 657 ఎకరాల భూమిలో వాన్‌పిక్ కు చెందిన 551 ఎకరాలు, పట్టా భూమి 103 ఎకరాలు, ప్రభుత్వ భూమి 12 ఎకరాలు సేకరించనున్నారు. తదుపరి దశలో మిగతా భూములను సేకరిస్తారు. అయితే 1088 ఎకరాలతోనే ముగిస్తారా లేక అదనంగా మరిన్ని ఎకరాల భూములను సేకరిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటుకు రెండు దశాబ్దాలకు ముందే బీజం పడింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పుడల్లా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు హడావుడి చేసి తర్వాత అది మరుగునపడిపోవడం షరా మామూలుగా మారింది.



విమానాశ్రయం స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ (ఫైల్)

దొనకొండ విమానాశ్రయం గాలికి..

గత ఎన్నికల ప్రచారంలో దొనకొండ విమానాశ్రయాన్ని పునరుద్ధరిస్తామని పశ్చిమ ప్రకాశం ప్రజల్లో ఆశలు రేపి అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత దొనకొండ విమానాశ్రయం ప్రాంతంలో కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు పరిశీలించి వెళ్లారు. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో కానీ దొనకొండ విమానాశ్రయం సంగతి మరిచిపోయారు. ఏడాదిన్నర అవుతున్నా ఇటువైపు తొంగిచూసిన పాపాన పోలేదు. ఈలోపు ఒంగోలులో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో దొనకొండ ప్రజలు ప్రధానంగా పశ్చిమ ప్రకాశం ప్రజలు విస్తుపోయారు. దొనకొండ విమానాశ్రయాన్ని పక్కన పెట్టేయడం వారిని నిరాశకు గురి చేస్తోంది. ఎందుకంటే గతంలో చంద్రబాబు ప్రభుత్వం దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హంగామా చేసింది. పారిశ్రామిక హబ్ పేరుతో ఆర్భాటంగా ప్రచారం చేసుకుంది. ఐదేళ్ల పరిపాలన చేసినప్పటికీ కనీసం ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా దొనకొండకు తీసుకొని రాలేకపోయిందన్న విమర్శను మూటకట్టుకుంది. ఇపుడు అధికారంలోకి వచ్చిన తరువాతైనా దొనకొండను అభివృద్ధి చేస్తారేమో అనుకుంటే ఉన్న విమానాశ్రయాన్ని కూడా లేకుండా చేశారు. దాంతో దొనకొండకు విమానాశ్రయం రాదు.. పరిశ్రమలు రావని ప్రజలు నిర్ణయించుకున్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

హార్బరు పేరుతో ప్రైవేటు భూముల సేకరణ

జిల్లాలోని ఐదు మండలాలు తీరప్రాంతంలో ఉన్నాయి. ఈ ఐదు మండలాల పరిధిలో 50 కిలో మీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. తీర ప్రాంతం కావడంతో ఇక్కడ ఎక్కువగా మత్స్యకారులు జీవిస్తున్నారు. ఇక్కడ ఫిషింగ్ హార్బరు నిర్మిస్తామని కూటమి పాలకులు హడావుడి చేస్తున్నారు. ఇందుకోసం అధికారుల బృందం కొన్ని గ్రామాలను సందర్శించి ఫిషింగ్ హార్బరుకు అనుగుణమైన ప్రాంతాలను పరిశీలించింది. కె.పల్లెపాలెం గ్రామ పరిసరాలు హార్బరు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నట్లు గుర్తించింది. ఇక్కడ ఏకంగా వేయి బోట్లు నిలుపుకునేలా జెట్టి నిర్మిస్తామని, అందుకోసం భూ సేకరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. హార్బరు నిర్మాణం కోసం ప్రభుత్వ భూమితో పాటుగా ప్రైవేటు భూమి కూడా సేకరిస్తామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయులందరూ 2025 సంవత్సరానికి ఉపాధ్యాయ దినోత్సవ (గురుపూజోత్సవం) సెప్టెంబరు 5న జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 23వ తేదీలోపు ఎంఈఓలకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. మండల విద్యాశాఖాధికారులు పరిశీలించిన దరఖాస్తులను డిప్యూటీ డీఈఓకు 25వ తేదీలోపు అందించాలన్నారు. డిప్యూటీ డీఈఓలు పరిశీలించిన దరఖాస్తులను 27వ తేదీ లోపల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుకు కనీసం 15 సంవత్సరాల బోధనా అనుభవం కలిగి ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణ చర్యలకు లోనై ఉండకూడదని తెలిపారు.

సౌత్ ఇండియా తైక్వాండో చాంపియన్ షిప్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్, పక్కన నిర్వాహకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కమలా విద్యా సంస్థల ప్రాంగణంలో సీబీఎస్ఈ స్కూళ్ల సౌత్ ఇండియా జోన్ 1 తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ పవన్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ సింధూజ ప్రారంభించారు. దక్షిణాది రాష్ట్రాల పోటీలను మార్కాపురంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, అండమాన్, పుదుచ్చేరి నుంచి 1200 మంది విద్యార్థినీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండ్ టోర్నమెంటు అబ్జర్వర్ డాక్టర్ సీ దొరై, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముఖేష్‌కుమార్, ఏపీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె అబ్దుల్ సలాం, ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంట్ అఖిల్ పాల్గొన్నారు.


కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల పత్రాలను పరిశీలిస్తున్న డీపీఓ సిబ్బంది

ఒంగోలు టౌన్: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ పరిశీలనకు మొత్తం 349 మంది అభ్యర్థులకు గాను 327 మంది హాజరయ్యారు. 153 మంది సివిల్ అభ్యర్థులకు గాను 144 మంది, 196 ఏపీఎస్పీ అభ్యర్థులకు గాను 183 మంది హాజరయ్యారు. అభ్యర్థుల కుల ధ్రువీకరణ పత్రాలు, స్థానికత సర్టిఫికెట్లు, స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్లు పరిశీలించారు. మూడు సెట్ల అటెస్టేషన్ పత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ఉద్యోగాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నిటినీ సమగ్రంగా పరిశీలించారన్నారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులను తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఏఓ పీఈ విజయ కుమార్, ఆర్ఐలు సతారామిరెడ్డి, రమణా రెడ్డి, డీపీఓ సూపరింటెండెంట్ షేక్ సందాని బాషా, డి.శైలజ పాల్గొన్నారు.

రూ.84 లక్షల మొక్కజొన్న, కంది విత్తనాలు సీజ్



ఫ్యాక్టరీలో విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

పుల్లలచెరువు: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.84.20 లక్షల విలువైన మొక్కజొన్న, కంది విత్తనాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఘటన పుల్లలచెరువులో శుక్రవారం జరిగింది. ఇన్వెక్టా అగ్రిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనుమతి పత్రాలు లేని, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయని 252.27 క్వింటాళ్ల మొక్కజొన్న, కంది విత్తనాలను సీజ్ చేసి వాటి అమ్మకాలను నిలిపేసినట్లు ఏఓ గోపికృష్ణ, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ జవహర్ నాయక్ తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ బి.రామారావు, సీఐ ఎస్.రాఘవరావు పాల్గొన్నారు.

ప్రజా కళలతోనే సమాజంలో మార్పు సాధ్యం

- వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఒంగోలు టౌన్: ప్రజా కళలతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, నేటికీ జానపదాలకు, పౌరాణిక సాహిత్యానికి ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన రోజుల్లో కూడా బాహుబలి సినిమాను ఎంత మంది చూశారో పల్లె కన్నీరు పెడుతుందన్న పాటను అంతకుమించి చూశారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా జరుగుతున్న కళా ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఎంసీపీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కళలను కార్పొరేట్ శక్తులు తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఇందులో భాగంగా ప్రేక్షకులను వ్యసనపరులుగా మార్చడం, సమాజంలో భయభ్రాంతులను సృష్టించడం, హింసాప్రవృత్తిని పెంచిపోషించడం వంటి వాటిని ప్రమోట్ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి సినిమాలు బూతు సాహిత్యంతో దుర్వాసన వేస్తున్నాయని, తప్పుడు చరిత్రలను సినిమాలుగా నిర్మించి ప్రజల మెదళ్లలో విషం నింపుతున్నారని మండిపడ్డారు. ఇదే సినిమా రంగంలో అనేక మంది గొప్ప దర్శకులు వచ్చారని, ప్రపంచం మెచ్చే సినిమాలను నిర్మించారని అన్నారు. రాచరికంతో కూడిన హింసాప్రవృత్తిని పెంచిపోషిస్తున్న సినిమాలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఏకకాలంలో 27 పుస్తకాలను నిషేధించడం గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ అక్షరాన్ని నిషేధించడం మూర్ఖత్వమని, పాలకుల పిరికితనానికి నిదర్శనమన్నారు. ఒక పుస్తకాన్ని పాలకులు నిషేధిస్తే దాన్ని ప్రజలు గుండెల్లో దాచుకుంటారని చెప్పారు. తాను ఎమ్మెల్సీగా చట్టసభల్లో ప్రజల వాణిని బలంగా వినిపిస్తున్నానని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కళారూపాలను ఆయుధంగా చేసుకొని సీపీఐ అనేక పోరాటాలను నిర్మించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బండెనక బండికట్టి పాటతో ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించిన కమ్యూనిస్టులు 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టారని అన్నారు. అశ్లీల సాహిత్యానికి, అశ్లీల సినిమాలకు ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను ప్రజలు ఆదరించాలని కోరారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి నాయకులు చంద్రా నాయక్, రామకృష్ణ, చిన్నం పెంచలయ్య, పాట వెంకన్న, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సజీవంగా ఉంచేది కళలే

- సినీ దర్శకుడు బాబ్జీ



సినీ దర్శకుడు బాబ్జీ

ఒంగోలు టౌన్: ప్రజల్లో నిత్య చైతన్యాన్ని రగిలిస్తూ సమాజాన్ని సజీవంగా ఉంచేది కళలేనని సినీ దర్శకుడు బాబ్జీ చెప్పారు. ''ఒక్క రోజైనా ఒక్కసారైన కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా'' పాటతో ప్రసిద్ధుడైన ఆయన సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కళా ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేనంతగా దేశం సంక్షోభంలో కూరుకొనిపోయిందన్నారు. దేశ ప్రజల సంపదపై కార్పొరేట్ శక్తులు పెత్తనం కొనసాగిస్తున్నారని, దోపిడీ మరింతగా పెరిగిపోయిందని, అవినీతి వ్యవస్థీకృతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుడు స్వేచ్ఛగా మాట్లాడలేని దుస్థితి దాపురించిందన్నారు. ప్రజలు నమ్మకమైన ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంక్షోభ సమయంలో కవులు, కళాకారులే ప్రజల గొంతుకలను బలంగా వినిపిస్తున్నారన్నారు. ప్రజలను చైతన్యం చేస్తున్నారు కనుకనే గౌరీ శంకర్, ధబోల్కర్, స్వాన్ స్వామిలను తిరోగమన శక్తులు హతమార్చారని, ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తున్నందుకే ప్రజా యుద్ధనౌక గద్దర్ గుండెల్లో తూటాలు దించారని ఆరోపించారు. పాలకులు ఎంత అణచివేతకు గురిచేస్తున్నా, ఎన్ని ఆంక్షలు విధిస్తున్నా కవులు, కళాకారులు గళం విప్పి మాట్లాడుతూనే ఉన్నారని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రజలను జోలపాడి నిద్రపుచ్చడానికి పాలకులు సినిమా మాధ్యమాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. చరిత్ర పేరుతో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, సినిమా రంగాన్ని కార్పొరేట్ శక్తులు తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు లేకపోవడం వలన వారికి వచ్చిన నష్టమేమీ లేదని, దేశానికి, ప్రజలకే ఎక్కువ నష్టం జరుగుతుందని వ్యాఖ్యానించారు. అధికార రాజకీయాలు చేయకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులను ఆదరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మీ కోసం అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షుణంగా పరిశీలించి నాణ్యతతో సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులు, పీజీఆర్ఎస్ ఆడిట్ టీమ్ అధికారులతో సమావేశమయ్యారు. శాఖల వారీగా పీజీఆర్ఎస్‌పై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ రాజ్, ఎడ్యుకేషన్, ఏపీసీపీడీసీఎల్, మునిసిపల్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, దేవాదాయ తదితర శాఖలకు సంబంధించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఎక్కువ అర్జీలు వస్తున్నాయన్నారు. పరిష్కరించిన అర్జీలు తిరిగి రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు కరెక్ట్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారా లేదా అని, అర్జీదారులు సంతృప్తి చెందారా లేదా అని ఆడిట్ టీమ్ కచ్చితంగా పరిశీలించాలని ఆడిట్ టీమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీల్లో 47,200 అర్జీలను పరిష్కరించగా, 42,487 అర్జీలను ఆడిట్ చేశారని, అలాగే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో 16,834 అర్జీలను పరిష్కరించగా, 16,796 అర్జీలను ఆడిట్ చేసినట్లు చెప్పారు. రీ సర్వేకు సంబంధించి గ్రామ సభల్లో వచ్చిన అర్జీల్లో 8,624 అర్జీలను పరిష్కరించగా, 8,609 అర్జీలను ఆడిట్ చేసినట్లు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి పీఎంస్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాల రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సెక్షన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మనువాదులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


ఒంగోలు టౌన్: దేశ ప్రజలను ఐక్యంగా ఉంచడంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఎంతో దోహదపడిందని, అధికారంలోకి వచ్చిన మనువాదులు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో శుక్రవారం నిర్వహించిన ఒంగోలు కళా ఉత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన దేశంలో పలు కులాలు, మతాలు, భాషలు ఉన్నాయని చెప్పారు. దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. బీజేపీపై వామపక్షాలు చేస్తున్న పోరాటంలో కళాకారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పాలకుల అవినీతి బాగోతాలను ఎండగట్టాలన్నారు. సినీ నటుడు మాదాల రవి మాట్లాడుతూ తెలుగు సినిమా రంగానికి ఎంతో మంది కళాకారులను అందించిన ఘనత ప్రజా నాట్యమండలికి దక్కుతుందని చెప్పారు. పోలీసు వారి హెచ్చరిక దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ దేశంలో జరిగిన చారిత్రక పోరాటాల్లో ప్రజా కళాకారులు పోషించిన పాత్రను చరిత్ర ఎన్నటికీ మరచిపోదన్నారు.

ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, ఏపూరి సోమన్న ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సినీనటుడు సన్నీ అఖిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు, నల్లూరి వెంకటేశ్వర్లు, చంద్రా నాయక్, చిన్నం పెంచలయ్య, రామకృష్ణ, నాగరాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వేదిక మీద నల్లూరి, బాబ్జీ, సన్నీ అఖిల్, మాదాల రవి

సాక్షి చీరాల విలేకరి మురళి కన్నుమూత



కడియం మురళి

చీరాల అర్బన్: సాక్షి దినపత్రిక బాపట్ల జిల్లా చీరాల విలేకరి కడియం మురళి (51) శుక్రవారం ఉదయం మృతిచెందారు. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజులు క్రితం గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారు. ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. పత్రికా రంగంలో సుదీర్ఘకాలం పాటు జర్నలిస్టుగా ఆయన పనిచేశారు. సాక్షి దినపత్రిక చీరాల ఆర్‌సీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. అలానే ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన భౌతికకాయాన్ని చీరాలలోని జర్నలిస్టులు పట్టణంలో ర్యాలీగా స్థానిక హరిప్రసాద్‌నగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిలు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. చీరాల నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూముల రీసర్వే తనిఖీ

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని దావగూడూరు గ్రామంలో ఫేస్–3 లో భాగంగా జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని జేసీ గోపాలకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుత విధానంలో భాగంగా ప్రభుత్వ భూములు సర్వే చేస్తుండగా సర్వేలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో రెవెన్యూ అధికారులకు వివరించారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఫేస్–3 లో దావగూడూరు, కామేపల్లి, సతుకుపాడు, రామచంద్రాపురం, ఐఎస్ కండ్రిక, సాదువారిపాలెం, ఎస్ఎన్ కండ్రిక గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. రీ సర్వేలో గ్రామం మొత్తానికి బౌండరీ నిర్ణయించి మొదట ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, డొంకలు గుర్తించి తరువాత దేవదాయ భూములను గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత పట్టా భూములను గుర్తిస్తామని వివరించారు.



రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

క్లుప్తంగా

నేడు ప్రకాశం పంతులు జయంతి

● దేవరంపాడు, వినోదరాయునిపాలెం, ఒంగోలులో ప్రత్యేక కార్యక్రమాలు


దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహం విజయోత్సవ స్థూపం

ఒంగోలు సబర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 174వ జయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్నారు. జిల్లా యంత్రాంగం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. ప్రకాశం పంతులు జన్మించిన నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెంతో పాటు ఉప్పు సత్యాగ్రహ స్థూపం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న జన్మించారు. ఈ రెండు చోట్లతో పాటు ప్రకాశం భవన్ వద్ద కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.

అనంతవరం సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ


ఉప్పలపాటి శివరామరాజు

టంగుటూరు: మండలంలోని అనంతరం సర్పంచ్ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ ఆయా శాఖల అధికారులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంతో అధికారులు ఆయన చెక్‌పవర్‌ను ఏకపక్షంగా రద్దు చేశారు. టీడీపీ నాయకులు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీనిపై సర్పంచ్ శివరామరాజు హైకోర్టు తలుపు తట్టారు. ఆధారాలతో సహా నిరూపించారు. కేసు విచారణ అనంతరం ఆగస్టు 18న ఆయన చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ సంబంధిత శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశాల జారీ చేసింది. దీనిపై సర్పంచ్ శివరామరాజు మాట్లాడుతూ తాను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచ్‌నని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తిగా తాను ఇప్పటికీ ఏ తప్పూచేయలేదన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేశానే తప్ప ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించలేదని స్పష్టం చేశారు. కావాలనే టీడీపీ నాయకులు తన చెక్ పవర్‌ను రద్దు చేయించారని ఆరోపించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం


మంటల్లో కాలిపోయిన గుడిసె


అర్ధవీడు: ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పూరి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం ఉదయం అర్ధవీడు మండలంలోని అంకభూపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు మీనిగె బాలరంగయ్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రెక్కాడితేనే గానీ డొక్క నిండని పరిస్థితి. శుక్రవారం ఒంట్లో నలతగా ఉండటంతో కూలీ పనులకు వెళ్లలేకపోయాడు. ఇంట్లో వంట చేసుకొనే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఇరుగు పొరుగు వారు స్పందించి బిందెలతో నీరు చల్లి మంటలార్పే ప్రయత్నం చేసినా అదుపు కాలేదు. కంభం నుంచి 30 కి.మీ ప్రయాణించి అగ్నిమాపక శకటం వచ్చేలోగా గుడిసె పూర్తిగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు. ఆహారధాన్యాలు, దుస్తులు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకంతో సహా మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని, రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వృద్ధుడు వేడుకుంటున్నాడు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ప్రాంతం

హనుమంతుని పాడు: మండలంలోని నందన వనం పంచాయతీ శివాలయం, రంగనాయకుల గుడిలో గుప్తనిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపిన సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. మల్లప్పచలలో ఉన్న రంగనాయులు స్వామి ఆలయం పక్కన దుండగులు తవ్వకాలు జరిపినట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. అనంతరం ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్థానికుల అండతోనే తవ్వకాలు జరిగి ఉంటాయని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.

మందు.. విందు.. పొందు @పునుగోడు!


పునుగోడు రిజర్వాయర్ ప్రాంతం

కొండలు గుట్టల నడుమ విశాలమైన పునుగోడు జలాశయం.. పక్కనే పచ్చని పంటల పొలాలు.. మరో వైపు గుబురు చెట్లు.. వీటికి కాస్త దూరంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ట్రాక్.. రిజర్వాయర్‌లో జాలర్ల చేపల వేట.. మనసును పరవశింపజేసే ఈ ప్రకృతి అందాలు కనిగిరి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. అడపాదడపా ఇక్కడికి పర్యాటకులు వచ్చి వెళ్తుంటారు. అయితే ఈ ముసుగులో అసాంఘిక శక్తులు పునుగోడు రిజర్వాయర్ పరిసరాలను తమ అడ్డాగా మార్చుకున్నాయి. కొండలను ఆనుకుని ఉన్న శివారు ప్రాంతం కావడం, ప్రధాన రహదారులకు దూరంగా ఉండటంతో జూదదారులు, మందుబాబులు, గంజాయి బ్యాచ్‌కు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ క్రమంలోనే తమ చర్యలతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న సంఘటనలూ లేకపోలేదు.

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పునుగోడు రిజర్వాయర్ పరిసరాలు
- మందుబాబులు, జూదరులకు డెన్‌గా మారిన వైనం
- ప్రాణాలు తీస్తున్న ఈత సరదా.. రెండేళ్లల్లో ఐదుగురు విద్యార్థులు మృతి
- పోలీస్ నిఘా లేకపోవడంతో విచ్చలవిడిగా వ్యవహారాలు


పునుగోడు గ్రామం


రిజర్వాయర్‌లో నుంచి మృతదేహాలను తెస్తున్న దృశ్యం(ఫైల్)

కనిగిరి రూరల్:

విందు చేసుకోవాలన్నా.. మందు తాగాలన్నా కనిగిరి, మర్రిపూడి ప్రాంతంలోని యువతతోపాటు ఇతరులు ఠక్కున ఎంపిక చేసుకుంటున్న ప్రాంతాల్లో పునుగోడు రిజర్వాయర్ ప్రథమ స్థానంలో నిలుస్తోంది. రిజర్వాయర్ పరిసరాల్లో నిత్యకృత్యమైన అసాంఘిక కార్యకలాపాలే అందుకు నిదర్శనం. కనిగిరి పట్టణానికి పునుగోడు గ్రామం 6 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి రో 2 కి.మీ ప్రయాణిస్తే రిజర్వాయర్. మర్రిపుడి మండలంలోని గార్లపేటకు కూడా రిజర్వాయర్ పరిసరాలు దగ్గరగా ఉంటాయి. దీంతో ఈ రెండు మండలాలకు చెందిన కొందరు వ్యక్తులు తమ అసాంఘిక కార్యకలాపాలకు పునుగోడు జలాశయాన్ని డెన్‌గా మార్చుకున్నారు. జూదరులు ఏడాదిలో నాలుగు నెలలపాటు ఈ ప్రాంతాన్ని పేకాట శిబిరాల నిర్వహణకు అడ్డాగా చేసుకుంటున్నట్లు సమాచారం. ఇక మద్యం పార్టీలు, విందు వినోదాలు నిత్యకృత్యమయ్యాయి. గంజాయి బ్యాచ్, వ్యభిచారులు సైతం ఈ ప్రాంతం ఆవాసంగా మారింది.

మందుబాబుల జోరు

రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో మందు బాబులు, ఆడపిల్లలతో వచ్చి గడిపే వారు ఎక్కువయ్యారని స్థానికులు చెబుతున్నారు. కనిగిరి పట్టణానికి చెందిన కొందరు యువకులు, విద్యార్థులు రిజర్వాయర్ వద్ద మద్యం, గంజాయి సేవించి రాత్రి 11 గంటల తర్వాత బైక్‌లు, కార్లల్లో జోగుతూ వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పునుగోడులో అక్రమ మద్యం

కనిగిరి నుంచి వెళ్లే యువకులు, విద్యార్థులు పట్టణంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేయకుండా నేరుగా పునుగోడు చేరుతున్నారు. గ్రామంలో బెల్టు షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తుండటంతో అక్కడే మద్యం కొనుగోలు చేసి రిజర్వాయర్ పరిసరాల్లో తాగి ఊగుతున్నారు. బిర్యానీ పొట్లాలు పార్శిల్ చేసి తీసుకెళ్లి అక్కడే తిని చీకటి పడిన తర్వాత తిరిగి వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

గతేడాది 2024 జూలై 23న కనిగిరి పట్టణానికి చెందిన ముగ్గురు కాలేజీ విద్యార్థులు ఈత కొట్టేందుకు పునుగోడు రిజర్వాయర్ వద్దకు వెళ్తూ.. సమీపంలోని పొలం రోడ్డులో విద్యుత్ తీగ తగిలి మృతి చెందారు. ఈ ఘటనలో బైక్‌తో సహా ముగ్గురు విద్యార్థులు కాలి బూడిదై తల్లిదండ్రులకు కన్నీరు మిగిల్చారు. తాజాగా మంగళవారం కనిగిరి చెందిన ఇద్దరు విద్యార్థులు రిజర్వాయర్‌లో శవాలై తేలారు.

అమ్మానాన్నకు తెలియకుండా.. పోలీసులకు చిక్కకుండా..!

విలాసాలకు అలవాటు పడిన కొందరు యువకులు.. ఆదివారం, ఇతర సెలవు దినాలు రాగానే బైక్‌లపై షికారు చేసేందుకు, ఈత సరదా తీర్చుకునేందుకు పునుగోడు చేరుకుంటున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా, పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు రిజర్వాయర్ పరిసరాలను తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. చెరువులు, రిజర్వాయర్ల వద్ద కాపలాగా ఉండే లస్కర్ల వ్యవస్థను ప్రభుత్వం తొలగించింది. దీంతో సరదాగా చెరువులు, రిజర్వాయర్లలో దిగిన వారు ప్రమాదానికి గురైతే వారిని కాపాడే నాథుడు లేకుండాపోయాడు. దీంతో డ్రౌనింగ్ మృతుల సంఖ్య పెరుగుతోంది. రిజర్వాయర్ పరిసరాల్లో పోలీసుల నిఘా లేకపోవడం వల్లే అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.


గతేడాది బైక్‌తో సహా కాలి బూడిదైన విద్యార్థులు(ఫైల్)

కనిగిరిలో 'ఘన'నాథుడు



కనిగిరి రూరల్: వినాయక చవితి పండగకు కనిగిరిలో భారీ గణనాథుని కొలువుకు సిద్ధం చేశారు. ఈ మేరకు సుమారు రూ.5.50 లక్షల ఖరీదు చేసే వినాయకుని విగ్రహాన్ని హైదరాబాద్ దూల్‌పేట నుంచి ప్రత్యేక వాహనంలో కనిగిరికి శుక్రవారం తీసుకొచ్చారు. పట్టణంలోని 9వ వార్డులో వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న భారీ గణపతి విగ్రహానికి కనిగిరి హైవేలోని కొత్తూరు అభయాంజనేయ స్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం మేళతాళాలతో వినాయకుని కొలువుదీర్చే మండపం వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వాల్మీకి యూత్, విగ్రహ కమిటీ నాయకులు మాట్లాడుతూ మహంకాళి అవతారంలో విఘ్నేశ్వరుడు కొలువుదీరుతున్నట్లు తెలిపారు. సుమారు 26 అడుగుల ఎత్తు, తలపై నాలుగు అడుగుల నాగ పడగ, కిరీటం, 23 అందుగుల వెడల్పు, సుమారు 5 టన్నుల బరువు ఉంటుందన్నారు. బహుశా జిల్లాలోనే అత్యంత పెద్ద గణపతి విగ్రహం ఇదే అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పుస్తకావిష్కరణలో రచయితల సందడి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు టౌన్: నగరంలోని పీవీఆర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న పుస్తకావిష్కరణ మహోత్సవంలో ఎనిమిదో రోజు శుక్రవారం రచయితలు సందడి చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రచయితలు, పాఠకులు, సాహితీ ప్రేమికులతో పుస్తకాల స్టాల్స్ వద్ద రద్దీ నెలకొంది. దేశభక్తి గీతాల పోటీలో 80 మందికి పైగా పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వివిన మూర్తి రచించిన వాడూ–నేనూ, డా.దేవరాజు మహారాజు రచించిన హిందుత్వ సింహాసనం మీద అబద్ధాల చక్రవర్తి పుస్తకాలను ఆవిష్కరించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రసంగిస్తూ.. సమాజంలో నేటికి అంటరానితనం కొనసాగుతోందని, ఇది దేశానికి ఎంత మాత్రం మంచిదికాదన్నారు. మోదీ ప్రధాన మంత్రి అయిన తరువాత 11 ఏళ్ల కాలంలో ఏకంగా 140 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి దేశాన్ని ముంచేశారని విమర్శించారు. దేశంలో మతోన్మాద శక్తులు చెలరేగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి ప్రసంగిస్తూ... నేనూ వాడు పుస్తకంలో దళితుల సమస్యలను చర్చించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రదర్శన అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేపు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అండర్–17 క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. 2025 డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్ల వయసు కలిగిన వారు మాత్రమే అర్హులని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు తమ పరికరాలు, వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30న భీమవరంలో నిర్వహించనున్న 11వ అంతర్ రాష్ట్ర బాల బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

భార్యను కడతేర్చిన భర్త

● అనుమానంతో గొంతు కోసి దారుణ హత్య


హత్యకు గురైన రామలక్ష్మమ్మ

బేస్తవారిపేట: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమె గొంతుకోసి హత్య చేసిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని గలిజేరుగుళ్ల సమీపంలో ఉన్న పొలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పీవీ పురం గ్రామానికి చెందిన భార్య, భర్తలు పగ్గాల వెంకటేశ్వర్లు, రామలక్ష్మమ్మ(40) తాము సాగుచేసుకుంటున్న మొక్కజొన్న పొలం వద్దకు ఉదయం వెళ్లారు. వారి మధ్య ఏం జరిగిందో ఏమో.. పొలంలో వేప చెట్టు వద్ద భార్య గొంతు కోసి చంపేశాడు. ఈ విషయం సాయంత్రం 5 గంటల సమయంలో తమ్ముడికి ఫోన్ చేసి 'నీ వదినను చంపేశాను..దహనం చేసుకుంటారో, ఏం చేసుకుంటారో చేసుకోండని'' చెప్పాడు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో హత్య చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వెంకటేశ్వర్లు ఫోన్ స్విచాఫ్ చేసుకుని పరారయ్యాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సీఐ మల్లికార్జున, ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసెస్మెంట్ బుక్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

● ఏపీటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్


ఏడీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: పాఠశాలల్లో పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేసే కొత్త విధానం అనేక సమస్యలకు దారి తీస్తోందని, ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏడీ వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానం పాఠశాల పనివేళల్లో బోధన సమయాన్ని హరించేలా ఉందన్నారు. పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి బోధన గంటలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు పని భారంగా పరిణమించిందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్ నమోదుతో పాటు బబ్లింగ్ చేసే పని కూడా ఉపాధ్యాయులకు సంక్రమించిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదుకు మాత్రమే పరిమితమై మిగిలిన నమోదు నుంచి వెసులుబాటు ఇవ్వాలని పేర్కొన్నారు. కొత్త విధానంతో మంచి ఫలితాలు రావు సరికదా నష్టదాయకంగా మారకముందే ఈ విధానం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు హనుమంతు రావు, శేషారావు, ఓ.రవి, మండల శాఖ బాధ్యులు వీరరాఘవులు, రామారావు, సుబ్బయ్య, రాము, ఓ.హరి ప్రసాద్, రవి పాల్గొన్నారు.

పద్ధతి మారకుంటే ప్రభుత్వానికి సరెండర్

● వైద్య శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం


వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: 'పైనుంచి పట్టించుకునే వారు లేరు.. కింద స్థాయిలో పనిచేసే వారు లేరు అన్నట్లుగా ఉంది పరిస్థితి. మీ నిర్లక్ష్యం వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తోంది. సిగ్గుగా లేదా..?. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించకుండా ఏం చేస్తున్నారు?. పద్ధతి మార్చుకోకుంటే ప్రభుత్వానికి సరెండర్ చేస్తా'అని వైద్య శాఖ ఉన్నతాధికారులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఘాటుగా హెచ్చరించారు. వైద్యశాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. డెలివరీలు, సీజనల్ వ్యాధులు, జ్వరాల కేసుల నమోదు తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. వైరల్ జ్వరాల బాధితులను గుర్తించడంలో క్షేత్రస్థాయిలో ఆశాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. 'మీ పరిధిలో ఆసుపత్రులపై దృష్టి సారిస్తున్నారా లేదా..?. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీలను నియమించరా? కనీసం సమీక్షకు వచ్చేటప్పుడు నివేదికలు సమగ్రంగా తయారు చేసుకుని రారా?' అంటూ డీసీహెచ్ఎస్ శ్రీనివాస నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మార్కాపురం జీజీహెచ్‌ను గత నెలలో మంత్రితో కలిసి తనిఖీ చేసినప్పుడు చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి మీరేమి చర్యలు తీసుకున్నారు? నాకు రిపోర్టు ఎందుకు పంపించలేదు?' అంటూ సూపరింటెండెంట్ రామచంద్రరావును కలెక్టర్ ప్రశ్నించారు. కీలకమైన శాఖలోని ఉన్నతాధికారుల్లో ఇంత నిర్లక్ష్య ధోరణి ఏమిటని మండిపడ్డారు.

పెద్దదోర్నాలలో 'హ్యూజ్' మనీ స్కాం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పెద్దదోర్నాల: సులభ పద్ధతులతో డబ్బులు సంపాదించవచ్చన్న ఆశ కొందరిని నిలువునా ముంచుతోంది. ఎన్ని సంఘటనలు చోటు చేసుకుంటున్నా కొత్త తరహా మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా మండల కేంద్రంలో మరో సైబర్ మోసం వెలుగు చూసింది. హ్యూజ్ మనీ యాప్‌తో మండల ప్రజలు మరో మోసానికి గురయ్యారు. వీడియోలు చూస్తూ డబ్బులు సంపాదించవచ్చని ప్రజలను నమ్మించిన సైబర్ నేరగాళ్లు యాప్ లింకులతో మండల ప్రజలతో భారీగా డబ్బులు సేకరించి బోర్డు తిప్పేశారు. హ్యూజ్ పేరుతో వెలిసిన ఈ సైబర్ సంస్థలో డబ్బులు కొంత మొత్తంలో జమ చేస్తే ఎక్కువ మొత్తంలో ఆదాయం పొందవచ్చన్న పుకార్లను నమ్మి ప్రజలు వేలల్లో పెట్టుబడులు పెట్టారు. చివరకు సంస్థ బోర్డు తిప్పేయడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి యాప్‌లకు సంబంధించిన లింకులు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మండల కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సైతం హ్యూజ్ యాప్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన ప్రజలు మోసపోయినట్లు సమాచారం.

టంగుటూరులో ఆగిన పొగాకు వేలం


రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎం

టంగుటూరు: నోబిడ్లు అధికంగా జరుగుతున్నాయని చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు శుక్రువారం వేలం ప్రక్రియను అడ్డుకున్నారు. వేలం ప్రారంభమైన తర్వాత 40 బేళ్ల కొనుగోలు జరగగా వరుసగా 17 పొగాకు నోబిడ్లు, 5 పొగాకు బేళ్లు నో సేల్ జరిగాయి. దీంతో రైతులు ఆగ్రహం చెంది వేలాన్ని అడ్డుకున్నారు. వేలం నిర్వహణాధికారి గంట పాటు అటు కంపెనీ ప్రతినిధులతో, ఇటు రైతులతో చర్చలు జరిపినా ఫలితం లేదు. మధ్యాహ్నానికి ఒంగోలు ప్రాంతీయ అధికారి రామారావు వేలం కేంద్రానికి చెరుకొని మరో గంట చర్చలు జరిపినా రైతులు వేలం కేంద్రం వదిలి వెళ్లారు. వేలానికి 811 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 17 కొనుగోలు జరగగా 24 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.288కాగా, కనిష్ట ధర రూ.140 పలకగా సరాసరి రూ.199.57 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కనిగిరిలో సైబర్ మోసం

● ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి నుంచి రూ.60 వేలు మాయం

కనిగిరి రూరల్: పట్టణంలో మరో ఆన్‌లైన్ సైబర్ మోసం వెలుగు చూసింది. 13వ వార్డు మంగలి మాన్యానికి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆయన బ్యాంక్ ఖాతా నుంచి సుమారు 60 వేల రూపాయలు మూడు దఫాలుగా డ్రా చేశారు. గురువారం రాత్రి సెల్‌కు బ్యాంక్ ఓటీపీలు వరుసగా వచ్చాయి. అప్రమత్తమైన బాధితుడు వెంటనే మేనేజర్‌కు సమాచారం ఇచ్చాడు. ఓటీపీ లింక్‌లు తాక వద్దని ఆయన బాధితుడిని సలహా ఇచ్చారు. మరో అరగంటలోపు 22,400 ఒకసారి, రూ.19 వేలు మరోసారి, 18,600 ఇంకో సారి మొత్తం మూడు సార్లు రూ.60 వేలు దాక డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో మళ్లీ వెంటనే బ్యాంక్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారని, వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేయాలని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బాధితుడు బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు. కుమార్తె వివాహం కోసం దాచి పెట్టుకున్న నగదు కాజేయడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు టౌన్: నూతన బార్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్న వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె. వెంకట్ కోరారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో రియల్ ఎస్టేట్, రెస్టారెంట్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన బార్ పాలసీ గురించి వ్యాపారులకు వివరించారు. జిల్లా అధికారుల సమక్షంలో లాటరీ తీసి షాపులు కేటాయిస్తామని చెప్పారు.